క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయంలో రుద్రహోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం స్థాపిత దేవతాహోమం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో శత కలశాభిషేకం..

- ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీ క్షీరలింగేశ్వర ఆలయంలో అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భగా శివునికి శత కలశాభిషేకం నిర్వహించగా.. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈఓ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గురువారం ఆలయంలో సీతారామకల్యాణమహోత్సవం జరుగుతుందని ప్రకటించారు.

కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం



చిక్కడపల్లి: పీఅండ్‌టీ కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనం త్యాగరాయగానసభలో జరిగింది. గతంలో కాలనీలో చాలా ఏళ్లు నివసించి ప్రస్తుతం నగరంలోని వివిధ ప్రాంతాలు, ఇతర నగరాలు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వారు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రికెటర్ విశ్వనాథ్, చిట్టి ఆనంద్, రాజు, ఇంతియాజ్ అహ్మద్, శ్రీరామ్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

కాచిగూడ: టీఆర్‌ఎస్ పార్టీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన రైతు రుణమాఫీ హామీని సీఎం కేసీఆర్ వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో యువత, రైతులు, మహిళా సంక్షేమానికి తమ పార్టీ పెద్ద పీట వేస్తోందని వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సనత్‌నగర్ నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా వెంకటేశ్వర్లును నియమించినట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించి పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో పండించిన ప్రతి గింజను తెలంగాణ ప్రభుత్వమే కొనాలని పంటలు వేయడానికి కేంద్రం పర్మిషన్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు.

ఆలయాల ఆవరణలో రోడ్లకు మరమ్మతులు



ప్యాచ్‌వర్క్ పనులను చేయిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని సీతారాముల దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచనల మేరకు మరమ్మతులు చేయించారు. బుధవారం రాంనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మోజెస్, సీనియర్ నేత సుధాకర్ గుప్తా, తదితరులు పనులను పర్యవేక్షించారు. బి.సత్యవర్ధన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వంపై పోరాడాలి



రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి తదితరులు

అంబర్‌పేట: మూసీ ప్రక్షాళన కోసం నగర ప్రజలు ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని రిటైర్డు ఐఏఎస్, తెలంగాణ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి నుంచి నారాయణగూడ మీదుగా ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మూసీపై ప్రభుత్వం ఇచ్చిన హామీని ఎండగట్టారు. ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మూసీ పరిరక్షణ వ్యవస్థాపక కన్వీనర్ శ్రీశైలంపాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

• ఏప్రిల్ 3 నుంచి 13 వరకు పరీక్షలు • నిఘా నీడలో పరీక్షా కేంద్రాలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ప్రధానోపాధ్యాయులు నరేందర్‌యాదవ్

ముషీరాబాద్: ముషీరాబాద్ మండలంలో ఏప్రిల్ 3 నుంచి 13 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయగా.. వాటిలో వెంటిలేషన్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నాలుగు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

- ముషీరాబాద్ మండలంలో 7 ప్రభుత్వ పాఠశాలకు, మూడు రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన 483 మంది, 5 ఎడెడ్ పాఠశాలలకు చెందిన 83 మంది, వంద ప్రైవేటు పాఠశాలలకు చెందిన 4,109 మంది కలిసి మొత్తం 4,758 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు.
- ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 8.45 గంటల నుంచి పరీక్షా హాల్‌లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ఫస్ట్ లాంగ్వేజ్, సైన్స్ విద్యార్థులకు 20 నిమిషాల అదనపు సమయం కేటాయించారు.
- గతంలో కరోనా నేపథ్యంలో 11 పేపర్ల స్థానంలో 6 పేపర్లకు కుదించగా అదే విధానాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు.
- ప్రతీ 20 మంది విద్యార్థులకు ఓ ఇన్విజిలేటర్ చొప్పున 4 పోలీస్‌స్టేషన్లలో పరీక్షా పత్రాలను భద్రపరుస్తున్నారు. వీటి కోసం 24 మంది చీఫ్ సూపరెంటెండ్‌లను మరో 24 మంది స్పెషల్ డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయిస్తున్నారు.
- వేసవి కావడంతో పరీక్షా కేంద్రాల ఎదుట టెంట్‌ల ఏర్పాటుతో పాటు వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతున్నారు.
- ఇప్పటికే హాల్ టికెట్లను ఆయా పాఠశాలలకు పంపించడంతో పాటు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించారు.
- హాల్ టికెట్‌పై హెడ్‌మాస్టర్ సంతకం చేయాలనే నిబంధన లేదని విద్యార్థులను చివరి నిమిషంలో ఫీజుల పేరుతో వేధించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

95 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



అన్ని పాఠశాలల్లో సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ కొనసాగిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకుని వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదులు ఇస్తున్నాం. విద్యార్థులకు క్లాస్ టీచర్లు ఫోన్ చేసి ఉదయమే నిద్రలేపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెండు దఫాలుగా ప్రీ ఫైనల్ పరీక్షలు, స్లిప్ టెస్టులను నిర్వహించాం. వాటి ఫలితాలను అంచనా వేసుకుని ఈ ఏడాది ముషీరాబాద్ మండలంలో 95 శాతం ఉత్తీర్ణత సాధిస్తామనే నమ్మకంగా ఉంది. దీనికి తోడు ప్రభుత్వం వెనుకబడిన విద్యార్థులను మెరుగుపరిచేందుకు ముద్రించిన అభ్యాసన దీపిక కూడా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడేలా ఉంది.

–చిరంజీవి, ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి

రూ.11.5 లక్షలతో అభివృద్ధి పనులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్

అంబర్‌పేట: దశలవారిగా అభివృద్ధి పనులను నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ రూ.11.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో అవసరమైన ప్రతీ ప్రాంతంలో నూతన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జలమండలి అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, జాఫర్, మహేష్ తదితరులున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీలో వెంకట్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని నిర్వాహకులు, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా శోభాయాత్రను విజయవంతం చేయాలని బైక్‌ర్యాలీ నిర్వహించారు. బాగ్ అంబర్‌పేట్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి రెడ్‌బిల్డింగ్, అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్, గోల్నాక, నల్లకుంట మీదుగా కాచిగూడ వరకు ర్యాలీ నిర్వహించారు. శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వెంకట్‌రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, ఆనంద్‌గౌడ్, చుక్క జగన్ తదితరులున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డిలు నిర్వాహకులతో శోభాయాత్రపై మున్సిపల్ గ్రౌండ్‌లో చర్చించారు.

పర్యావరణ హితంగా శోభాయాత్ర నిర్వహించాలని వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 30న నగరంలో నిర్వహించే శోభాయాత్ర వాహన కాలుష్యానికి దూరంగా, పర్యావరణ హితంగా ఉండేలా భక్తులు, కార్యకర్తలను చైతన్య పరిచే విధంగా కృషి చేయాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ బుధవారం నవమి ఉత్సవ సమితికి ఓ పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. భక్తి ప్రవత్తులతో జరగాల్సిన శోభయాత్రలో వాహనాలకు ప్రవేశం లేకుండా భక్తుల పదఘట్టణలు మాత్రమే యాత్రలో ఉండాలని కౌన్సిల్‌ను కోరింది. శోభాయాత్రను సగటు ప్రజానీకం ఆస్వాదించేలా వాయు, శబ్దకాలుష్యాలు దరిచేరకుండా చూడాల్సిన చొరవ ఉత్సవ కమిటీ తీసుకోవాలని కౌన్సిల్ నాయకులు ఎస్సీ.హెచ్.రంగయ్య, ఉప్పల వెంకటేష్‌గుప్తా తదితరులు కోరారు. పోలీసులు కూడా ఈ యాత్రలో శబ్ద, వాయు కాలుష్యాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రీయనవీన్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానిక కార్పొరేటర్ సుప్రీయనవీన్‌గౌడ్ అన్నారు. గత మూడు రోజులుగా పాఠశాలకు విద్యుత సరఫరా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం కార్పొరేటర్ పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో ఫోన్‌లో సమస్యపై చర్చించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కంచికుమార్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుబేర్ తదితరులున్నారు.

శ్రీరామనవమి వేడుకలపై సమీక్ష



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు కాచిగూడ లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు కొండూరు వినోద్‌కుమార్, మణికొండ రమేష్‌కుమార్, లవంగాల అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో వారు సమీక్ష నిర్వహించి మాట్లాడారు. 2007లో అప్పటి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గంప చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను ప్రతి ఏటా మహాసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. స్వామివారి కల్యాణ వేడుకలకు మున్నూరుకాపులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. మాణిక్ ప్రభు, లింగిశెట్టి హనుమంతరావు, జొన్నాడ శ్రీకాంత్, నేమదాది సత్యేందర్, సురేష్, దత్తుమూర్తి, చెలిమెల రమేష్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి జైలు శిక్ష

కాచిగూడ: రెండు వేర్వేరు ఘటనలలో గొడవపడిన ఇద్దరికి జైలు శిక్షపడిందని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపారు. మోతీమార్కెట్‌కు చెందిన రౌడీషీటర్ శ్రీకాంత్‌కు 8 రోజులు, మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన నవీన్‌కు 5 రోజులు జైలు శిక్షను విధిస్తూ నాంపల్లి కోర్టు బుధవారం తీర్పును వెలువరించిందని అడ్మిన్ ఎస్సై రవికుమార్ పేర్కొన్నారు.

రైల్లో సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: సెల్‌ఫోన్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జయదీప్‌సింగ్ మంగళవారం కాచిగూడ నుంచి రైల్లో వెళ్తుండగా కర్నూల్ వద్ద అతడి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. కాగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం కర్నూల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

మరో ఘటనలో ల్యాప్‌టాప్

కాచిగూడ: ల్యాప్‌టాప్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన మహ్మద్ అష్రఫ్ మంగళవారం కాచిగూడ నుండి యశ్వంత్‌పూర్‌కు రైల్లో వెళ్తుండగా మహబూబ్‌నగర్ స్టేషన్ వద్ద అతడి ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎ.సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి (30) ఫలక్‌నుమా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై గులాబీ రంగు చొక్కా, నలుపు రంగు చొక్కా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'



కవాడిగూడ: అవినీతిని ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ధోరణితో రాష్ట ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీని నిరసిస్తూ.. టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడిలో అరెస్టై చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, ముషీరాబాద్ బీజేవైఎం అధ్యక్షులు ఆయూష్‌లను బుధవారం కలిసి భోలక్‌పూర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సన్మానించారు. అవినీతిపై పోరాడుతున్న బీజేపీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని పూసరాజు హెచ్చరించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకులు సాయియాదవ్, నరేష్ తదితరులున్నారు.

చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి

చిక్కడపల్లి: చిరుధాన్యాలను ప్రతిరోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. 2023 పోషణ పక్షంలో భాగంగా పిల్లలకు, గర్భిణీలకు చిరుధాన్యాల ద్వారా పొందే పోష్టికాహారంపై అవగాహన కల్పించారు. బుధవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణీలకు అంగన్‌వాడీ అందించే పాలు, గుడ్లు, బాలామృతం లాంటి పోష్టికాహారంతో పాటు చిరుధాన్యాలను వాటి ద్వారా తయారు చేసే తినుబండారాలను అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పోషణ అభియాన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ నాయకులు వినయ్, నవీన్, ముషీరాబాద్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్లు నర్సమ్మ, ప్రమీల, కౌసర్‌బేగం, సబిత, ఆయాలు మాణిక్యమ్మ, అనసూయ, ఉమ, ఆశవర్కర్ దుర్గ పాల్గొన్నారు.

శతక పద్య విశారదుడు శేషప్ప కవి

చిక్కడపల్లి: నరహరి, నృసింహ, నృకేసరి శతకం వంటి శతకాలు ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సందేశం అందించిన శేషప్ప కవి శతక పద్య విశారదుడు అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో శేషప్ప కవి సంస్మరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోతన, సోమనాథుడి వలే శేషన్న కవి ఇంటి పేరు తన గ్రామం ధర్మపురినే పెట్టుకున్నారన్నారు. గుడిలో పూజరిగా చాలీచాలని వేతనంతో జీవితం గడపిన వారు శేషప్ప కవి అని అన్నారు. తెలంగాణ ప్రాంతం మండలీకాలు తన రచనలలో ఉపయోగించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, కళా పోషకుడు వెంకట్‌రెడ్డి, కవి రఘుశ్రీ, కమిషన్ సభ్యుడు ఉపేంద్ర తదితరులున్నారు.

సీతారాములకు అష్టోత్తర కలశాభిషేకం



108 కలశాల ఆవు పాలతో అష్టోత్తర కలశాభిషేకం చేస్తున్న అర్చక స్వామి

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో గత 4 రోజులుగా స్వామివారి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. అర్చక స్వాముల మంత్రోచ్ఛరణల మధ్య 108 కలశాల ఆవు పాలతో సీతారామచంద్ర స్వాములకు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేడు సీతారాముల కల్యాణం..

- శ్రీరామ నవమి సందర్భంగా ఈరోజు ఉదయం 11 గంటలకు సీతారాములు కళ్యాణం ఉంటుందని ఆలయ ఈఓ జయంతి తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. బాగ్ అంబర్‌పేట్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం 9.15 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందని సాయిబాబా సంస్థాన్ పాలక మండలి ప్రతినిధులు ప్రకటించారు. మధ్యాహ్నం బాబా హారతి అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

మాజీలకు గౌరవ పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కౌన్సిలర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మంచాల వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జీవితకాలం గౌరవ పెన్షన్ ప్రతినెల రూ.12 వేలు ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు వివిధ హోదాల్లో సేవలు అందించిన మాజీ ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో గ్రామ, నగర మాజీ ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా రెండెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఆ స్థలంలో 30 గదులతో భవన నిర్మాణం చేపట్టి కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. మరణించిన మాజీ ప్రజాప్రతినిధి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఎలాంటి షరతులు లేకుండా రూ.10 లక్షల బ్యాంక్ రుణం మంజూరు చేయాలని కోరారు. యాదవ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉపేంద్రయాదవ్, నాయకులు లింగస్వామి, పీ.వీ. మోహన్, చంద్రశేఖర్, ప్రసాద్ తదితరులున్నారు.

నిరంతరం ప్రజల మధ్యే ఉంటా : ఎమ్మెల్యే ముఠా గోపాల్



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు అందించడంలో నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్‌లో రూ.22 లక్షలతో కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవాడిగూడ డివిజన్‌లో అత్యధికంగా బండమైసమ్మనగర్‌లో నిరుపేదలు, కూలీలు ఎక్కువగా నివసిస్తున్నారన్నారు.

- 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్తీ అప్పటి జనాభాకు అనుగుణంగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. పెరిగిన జనాభాతో మహిళలు, తాగునీటి సమస్యను ఎదుర్కొన్నారన్నారు.
- బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయించి నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు.
- వేసవిలో తాగునీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, బస్తీ నాయకులు లవకుమార వెంకటరమణ, మహేష్, సురేందర్‌గౌడ్, రాజేష్, శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, ఘంట శ్రీను, కుమార్‌గౌడ్, దిలీప్ యాదవ్, హనుమాన్‌దేవాలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, మాధవి, డీజీఎం కార్తీకరెడ్డి, ఏఈ శ్రీధర్ తదితరులున్నారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు..

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని జెమినికాలనీలో నెలకొన్న స్థానిక సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం జెమిని కాలనీ ఉదయశ్రీ యువజన మండలి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నగర నాయకుడు పూస గోరక్‌నాథ్ సారథ్యంలో జెమినికాలనీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలి నాయకులు రమేష్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు కాలనీ సమస్యలను వివరించారు. కృష్ణగౌడ్, శ్రీనుగుప్తా, యాదయ్య, బాలనర్సింహ్మా, సత్యనారాయణ, విఠల్, మనీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.